క్లుప్తంగా

పండ్లతో తులాభారం



పండ్లతో బాలికకు వేస్తున్న తులాభారం

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో 13 ఏళ్ల బాలికకు వివిధ రకాల పండ్లతో గురువారం తులాభారం వేశారు. రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ స్కూలులో ఏడో తరగతి చదువుతున్న మండలంలోని తోకాడకు చెందిన బోయిడి వర్షిణికి ఆమె తల్లిదండ్రులు సీజన్ వారీగా లభించే వివిధ రకాల పండ్లతో తులాభారం వేసి మొక్కును తీర్చుకున్నారు. మధ్యాహ్న హారతి అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

చట్టాలపై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న అధికారులు, ప్రతినిధులు

రాజానగరం: మహిళల సంరక్షణకు ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ చట్టాలపై గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని మీటింగ్ హాలులో అవగాహన సదస్సు జరిగింది. మన హక్కులకై పోరాడు, సాధించు ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ యాక్స్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జేఏ ఝాన్సీ మాట్లాడుతూ, ప్రతి మహిళ సమస్యలపై గళం విప్పాలన్నారు. తహసీల్దారు జీఏఎల్ఎస్ దేవి మాట్లాడుతూ, పట్టాదారు పాస్ పుస్తకాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్‌బాబు, ఉద్యమ సంస్థ ఉత్తరాంధ్ర చైర్మన్ కోడి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్ట్

కోరుకొండ: మండలంలోని గాడాల పొన్నాలమ్మ గుడి సమీపంలో సారాను తరలిస్తున్న కామటి గోవిందును కోరుకొండ ఎస్సై నాగరాజు గురువారం అరెస్ట్ చేశారు. అతని నుంచి 60 లీటర్ల సారా, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

రంగంపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సింగంపల్లి గ్రామంలో గురువారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన పడాల శ్రీను అనే వ్యక్తి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

సీతానగరం: మోటార్ సైకిల్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్సై డి.రామ్‌కుమార్ గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జాలిమూడికి చెందిన వెలుగూరి పోశిబాబును ఆటో ఢీకొనడంతో, గాయాలపాలై రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం మోటారు సైకిల్‌పై సీతానగరం వచ్చి, తిరిగి సాయంత్రం జాలిమూడి వెళుతున్న పోశిబాబును, శ్రీరామనగరంలో దుర్గమ్మ ఆలయం వద్ద ఆటో ఢీకొంది. ఈ ఘటనలో అతడి కుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామ్‌కుమార్ తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ వీధి నాటకం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు కల్చరల్ ఈవెంట్స్ రాజు కుమార్ కళా బృందం వారిచే ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దుర్గాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవాలి

పెదపూడి: గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని లేకుంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సచివాలయం కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి తడి చెత్తను వర్మీ కంపోస్టుగా, పొడి చెత్తను రీసైక్లింగ్ కొరకు ఉపయోగించాలని చెప్పారు.

రోవర్ మెషీన్ రికవరీ

కోరుకొండ: దోసకాయలపల్లిలో ఇటీవల దొంగలు అపహరించిన రోవర్ మెషీన్‌ను స్థానిక పోలీసులు గురువారం రికవరీ చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. భూముల సర్వేకు ఉపయోగించే ఈ రోవర్ మెషీన్ అపహరణపై సీఐ వై.సత్యకిషోర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణలో రోవర్ మెషీన్‌తో పాటు, చోరులు కూడా పట్టుబడ్డారని, వారిని కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు.

ఊరెళుతున్నారా.. ఊడ్చేస్తారు సుమా..!

- తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు
- వేసవిలో పేట్రేగిపోతున్న దొంగలు
- ఊళ్లు, విహారయాత్రలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించడం మేలు
- పోలీసులకు ముందస్తు సమాచారమివ్వడం శ్రేయస్కరం



ఊలపల్లిలో చోరీని పరిశీలిస్తున్న ఎస్సై రవిచంద్ర కుమార్

బిక్కవోలు: వేసవి సెలవులు కదా అని విహార యాత్రలకు, సుదూర ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లకు బయలు దేరుతున్నారా.. అయితే తస్మాత్ జాగ్రత్త. తాళాలు లేని ఇళ్లే లక్ష్యంగా దొంగలు పేట్రేగిపోతుండడం సర్వత్రా ఆందోళనకు గురి చేస్తోంది. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా తాళం వేసిన ప్రతి ఇంట్లో దొంగతనాలకు తెగబడుతున్నారు. చేతికి దొరికినది, కంటికి కనిపించినదంతా ఊడ్చేసి పట్టుకుపోతున్నారు. ఇటువంటి పరిస్థితులలో దూర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు ముందుస్తు సమాచారం ఇవ్వడం ద్వారా నేర నియంత్రణకు అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంటుంది.

సీసీ కెమెరాల ఏర్పాటుతో..

ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో అనపర్తి నియోజకవర్గంలో ప్రజలు ఎక్కువగా ఊర్లు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, వేసవి విడిది కేంద్రాలకు వెళ్తుంటారు. ఏటా ఇటువంటి సమయాల్లోనే దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తాళాలు వేసి ఉన్న ఇళ్లతో పాటు ఆరు బయట నిద్రించేవారి ఇళ్లల్లోనూ దొంగతనాలు జరుగుతున్నాయి. దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. వీలైనంత వరకు ఇళ్ల వద్ద వీధుల్లో సీసీ కెమెరాలు చేసుకుంటే మంచిదని చెబుతున్నారు. సీసీ కెమెరాల ద్వారా చోరీలను నియంత్రించవచ్చని అవగాహన కల్పిస్తున్నారు.

బ్యాంకుల్లోనే భద్రం

వేసవి సెలవుల్లో వివిధ ప్రాంతాలకు ఎక్కువగా ప్రయాణాలు చేసేవారు ముందుస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. తమ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే తక్షణమే పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాలి. వేసవిలో ఉక్కపోతే కారణంగా ఆరుబయట, డాబాలపై నిద్రించేందుకు చాలామంది ఆసక్తి చూపుతారు. ఇటువంటి వారు తమ ఇళ్లల్లోని బంగారు ఆభరణాలను బ్యాంకుల్లో భద్రపరుచుకుంటే మంచిది. అలాగే రాత్రి పూట వీధుల్లో గస్తీ కాసే పోలీసులకు ప్రజలు సహకరించాలి. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే పోలీసులక తెలియజేయాలి.యువత సైతం అప్రమత్తంగా వ్యవహరించాలి. చోరీల నియంత్రణకు సహకారం అందించాలి.

ఎల్‌హెచ్‌ఎంఎస్ అమలయ్యేనా?

ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం)పై ప్రజల్లో అవగాహన లేకపోవడంతో పూర్తి స్థాయిలో ఇది అమలు కావడం లేదు. ఈ విధానం అమల్లోకి వస్తే దొంగతనాలను సులభంగా నివారించవచ్చు. స్మార్ట్‌ఫోన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారి వివరాలు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుతాయి. ప్రయాణాలకు వెళ్లే ముందురోజు ఆరు అంకెల కోడ్‌తో పోలీసు రిక్వెస్ట్ ఆప్షన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ యాప్ అమల్లోకి వస్తే నమోదు చేసుకున్న వెంటనే పోలీసు సిబ్బంది వారి ఇంటికి వెళ్లి ఎల్‌హెచ్‌ఎంఎస్ పరికాలను అమర్చుతారు. దీంతో ఇళ్ల పోలీసుల రక్షణలోకి వెళ్తుంది. ఇంట్లో ఎవరూ లేని సమయాల్లో ఆగంతుకులు ప్రవేశిస్తే నేరుగా పోలీసు కంట్రోల్ రూమ్‌లో అలారం మోగుతుంది. దీంతో స్థానిక పోలీసులు అప్రమత్తమై ఆ ఇంటికి చేరుకుని దొంగలను పట్టుకునేందుకు వీలుంటుంది.



చోరీ జరిగిన ఓ ఇంట్లో చెల్లాచెదురుగా పడిఉన్న సామగ్రి (ఫైల్)

నియోజకవర్గంలో చోరీల వివరాలిలా..

- బిక్కవోలు మండలంలోని ఊలపల్లి వేద పాఠశాలలో డొక్క కామేశ్వరరావు ఆరోగ్యం బాగులేక రాజమహేంద్రవరం ఆసుపత్రికి వెళ్లడంతో ఆయన ఇంటి తాళాలు పగలగొట్టిన ఆగంతకులు రూ.4 లక్షల బంగారు, వెండి ఆభరణాలు దొంగలించుకుపోయారు.
- జి.మామిడాడ గ్రామంలోని ఓ విద్యా సంస్థ అధినేత ఇంట్లో జరిగిన చోరీలో బంగారు, వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. ఇలా అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో గత ఏడాదిగా 89 చోరీ కేసులు నమోదయ్యాయి.

చోరీల నియంత్రణకు ఇవిగో సూచనలు

- ఊరికి వెళ్లే సమయంలో ఇంట్లో అన్ని తలుపులకు తాళాలు వేసుకోవాలి.
- ఇంటి ప్రధాన ద్వారానికి వేసే తాళం నాసిరకం కాకుండా చూసుకోవాలి.
- తాళం వేసినట్లు కనిపించకుండా కర్టన్ వేసి ఉంచాలి.
- ఇరుగు, పొరుగు వారికి తమ ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పాలి.
- ప్రస్తుతం మార్కెట్‌లో వైఫైతో కూడిన సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. వీటి ధరలు అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉన్నాయి. వీటిని వినియోగించటం మేలు.
- ప్రస్తుతం అందరి వద్ద ఆండ్రాయిడ్ ఫోన్‌లు ఉన్నందున ఇంటివద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని ఫోన్‌కు అనుసంధానం చేసుకుంటే ఎప్పుకప్పుడు ఇంటిని పరిశీలించుకుంటూ ఉండవచ్చు.

పోలీసులకు సహకరించాలి

ప్రజలంతా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా దొంగతనాలను నిరోధించవచ్చు. ఊళ్లకు వెళ్లేవారు విలువైన ఆభరణాలను ఇళ్లల్లో ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవడం శ్రేయస్కరం. వేసవి సెలవులలో సుదూర ప్రాంతాలకు వెళుతున్నవారు ఎల్ హెచ్‌ఎంఎస్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకుంటే వారి ఇళ్లకు సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు పర్యవేక్షణ చేస్తాం. ప్రజలంతా ఉచితంగా ఈ సేవలు పొందవచ్చు.



– వాసంశెట్టి రవిచంద్ర కుమార్, ఎస్సై, బిక్కవోలు.

పేదింటి బిడ్డకు చేయూత



ప్రిన్సిపాల్ స్వామికి చెక్కును అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

అనపర్తి : ఆర్థిక పరమైన కారణాలతో ఆడ బిడ్డలు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో తమ సంస్థ పని చేస్తుందని జగ్గంపేటకు చెందిన టీం మణికర్ణిక స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు గున్నాబత్తుల పూజా అనూష అన్నారు. బిక్కవోలు మండలం కాపవరం గ్రామానికి చెందిన కర్రి శైలజాదేవి పదో తరగతిలో 520 మార్కులు సాధించింది. చిన్న వయస్సులోనే తండ్రి చనిపోవడంతో తల్లి కష్టపడి చదివించింది. ఇంటర్మీడియట్ విద్యకు ఆర్థికపరమైన అవాంతరాలు రాకుండా స్థానిక యువకులు స్వచ్ఛంద సంస్థను ఆశ్రయించగా వారు స్పందించి విద్యాదాతలు గౌరీశంకర్, మధుసూదనరావుల ఆర్థిక సహకారంతో మణికర్ణికా స్వచ్ఛంద సంస్థ విద్యార్థిని చదువు బాధ్యతలు తీసుకుంది. దాతలు అందించిన రూ.10వేల చెక్కును గురువారం అనపర్తి జీబీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామలింగస్వామికి అందచేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక సభ్యులు మోగలంక శ్రీనివాస్, గున్నాబత్తుల వీరబాబు, టీం సభ్యులు చిక్కాల మణికంత, పులిగ రమేష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల పంపిణీ

కోరుకొండ: మండల కేంద్రమైన కోరుకొండ మండల పరిషత్ కార్యాలయంలో 32 రకాల వ్యవసాయ పరికరాలను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గురువారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.29.31 లక్షల విలువైన వ్యవసాయ పరికరాలను రైతులకు అందించామని, ఇవి వ్యవసాయాభివృద్ధికి దోహదపడతాయన్నారు. వీటిలో ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు కూడా ఉన్నాయి. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.



రైతులకు వ్యవసాయ యంత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

జూలైలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో జూలై 14 నుంచి 19 వరకు క్వాంటం టెక్నాలజీస్ ఆపర్చునిటీస్ అండ్ థ్రెట్స్ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జరుగనుంది. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

పెదపూడి: ఈనెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను అంతా జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వి.రాజబాబు పిలుపునిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో పెదపూడి, కై కవోలు గ్రామాల్లో సమ్మె విజయవంతంపై ప్రచార కార్యక్రమాన్ని గురువారం నిర్వహించి, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చ, ఆలిండియా కమిటీలు పిలుపునిచ్చాన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక,రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న సమ్మె, గ్రామీణ బంద్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మడికి సత్యం, ఎల్లే సత్తిబాబు, బొచ్చా ఏసు, రెడ్డి దుర్గాదేవి,లోవరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లతో డీఎస్పీ సమావేశం

కోరుకొండ: సమాజంలో యువతను సన్మార్గంలో నడిపించేందుకు చర్చిల పాస్టర్లు సహకరించాలని నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ కోరారు. గురువారం ఆయన పాస్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, చర్చిల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనుమానితులను చర్చిలకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంఘ విద్రోహశక్తుల సమస్య నెలకొన్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సీఐ సత్యకిషోర్, ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కేంద్రం

సీటీఆర్ఐ: నగరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సివిల్ సర్వీసెస్, పబ్లిక్ సర్వీస్ కమిషన్, బ్యాంకింగ్, ఇతర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ప్రారంభించడం పేద విద్యార్థులకు శుభ పరిణామమని ఆర్‌కే స్టడీ సెంటర్ అధినేత పులుప రామకృష్ణ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కేంద్ర ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కళాశాలలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి సెల్‌ఫోన్ వదిలి, పుస్తకాలను చదవాలన్నారు. విద్యార్థులందరికీ లైబ్రరీని కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. పోటీ పరీక్షలకు శిక్షణ పూర్తిగా ఉచితమేనని తెలిపారు. నిష్ణాతులైన అధ్యాపకుల బోధనలు, సబ్జెక్టు మెటీరియల్, పాత ప్రశ్న పత్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులకు ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేయడానికి సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఆర్‌కే స్టడీ సెంటర్ లాంటి సంస్థతో ఎంఓయూ చేసుకోవడం శుభపరిణామన్నారు. సెంటర్ కో–ఆర్డినేటర్‌గా ఎంఎస్ ఫణికుమార్, పీజీ సెట్ కోచింగ్ సెంటర్ కో–ఆర్డినేటర్‌గా ఎం.శివప్రసాద్ అందుబాటులో ఉంటారన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఈఈ జేపీబీ నటరాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటవరం సబ్ స్టేషన్ నుంచి కొత్తగా 11 కేవీ కాటవరం ఫీడర్ లైన్ పనుల కారణంగా కాటవరం, జాలిమూడి గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు. అలాగే ముగ్గళ్ల సబ్ స్టేషన్ నుంచి సీతానగరం, రఘుదేవపురం 11 కేవీ ఫీడర్ పరిధిలో ట్రీ కటింగ్, లైన్ల మరమ్మతుల కారణంగా రఘుదేవపురం, రాపాక గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని తెలిపారు.

రాజానగరం: దివాన్‌చెరువు సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్‌పై మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నందున శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. ఈ కారణంగా దివాన్‌చెరువులోని అన్ని రకాల సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ(ఆపరేషన్స్) నటరాజన్ తెలిపారు.

డెల్టా ప్రాంత ప్రజల ఆరాధ్యదైవం సర్ ఆర్థర్ కాటన్

- ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి



రామవరంలో సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కృష్ణారెడ్డి, నాయకులు

అనపర్తి : ధవళేశ్వరం వద్ద ఆనకట్ట కట్టి డెల్టా ప్రాంతంలో బీడు వారిన భూములకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించిన సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు ఆరాధ్య దైవమని అనపర్తి మార్కెట్ కమిటీ తాజా మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం కాటన్ జయంతిని పురస్కరించుకుని రామవరంలో కాటన్ విగ్రహానికి కృష్ణారెడ్డితో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మాజీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు కర్రి రామచంద్రారెడ్డి, నల్లమిల్లి సంధ్యవెంకటరెడ్డి, లంక అవ్వమ్మప్రసాద్, వైఎస్సార్సీపీ నాయకులు నల్లమిల్లి ఆదినారాయణరెడ్డి, కర్రి గాంధీరెడ్డి, సబ్బెళ్ల తిరపారెడ్డి, కర్రి గోపాలరెడ్డి, సబ్బెళ్ళ శేషారెడ్డి, చింతా ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాటన్‌దొరకు నివాళులు

బిక్కవోలు: మండలంలోని ఆరికరేవుల గ్రామంలో కాటన్‌దొరకు ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం కాటన్‌దొర జయంతి సందర్భంగా సర్పంచి రెడ్డి నాగవేణికుమారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాటన్‌దొర ఈ ప్రాంతానికి చేసిన సేవల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస్, నీటి సంఘం సభ్యులు నాళం సత్తిబాబు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.



గడ్డివామి దగ్ధం

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో గురువారం తెల్లవారుజామున గడ్డివామి దగ్ధమైంది. అనపర్తి ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పందలపాకలోని సచివాలయం – 1 వద్ద గల ఖాళీ స్థలంలో యామల సూరిబాబు 10 ఎకరాల గడ్డివామి వేసుకున్నాడు. దాని నుంచి గురువారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు రేగాయి. స్థానికుల సమాచారంతో అనపర్తి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఐదు ఎకరాల గడ్డివామి కాలిపోవడంతో సుమారు రూ.40 వేల ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- వేసవి శిక్షణ శిబిరాలపై పెరుగుతున్న ఆసక్తి
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు
- విద్యాసంస్థలు, గ్రంథాలయాలు, స్వచ్ఛంద సంస్థల నిర్వహణ



ఎస్‌కేవీటీ స్కూలులో వేసవి శిక్షణ శిబిరంలో జాతీయ గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు



ఎస్‌కేవీటీ స్కూలులో వేసవి శిక్షణ శిబిరంలో చెస్ నేర్చుకుంటున్న బాలికలు

కంబాలచెరువు: ర్యాంకులు, మార్కుల కోసం పరుగులు పెట్టే విద్యార్థులకు తమలోని సృజనాత్మకత పెంపొందించుకునే ఆస్కారం తక్కువ. నిత్యం పుస్తకాల్లో మునిగితేలుతున్న వారికి ఏడాదంతా చదువుసంధ్యలతోనే సరిపోతుంది. ఈ పరిస్థితుల్లో వేసవి సెలవులే వారికి కాస్తంత సమయం దక్కుతుంది. ఈ క్రమంలోనే వేసవి సెలవులను విద్యార్థులకు ఉపయుక్తంగా మార్చుకోవాలని పలువురు విద్యా నిపుణులు చెబుతున్నారు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి సమయంలో విజ్ఞానం, వినోదం సంతరించుకునేలా మల్చుకోవాలంటున్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించుకుని, పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని సముపార్జించుకునేందుకు వినియోగించుకోవాలని చెబుతున్నారు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. నగరంలోని పలు విద్యా సంస్థలు, గ్రంథాలయాలు, స్వచ్ఛంద సంస్థలు ఇటువంటి శిబిరాలు ప్రారంభించారు.

రోజులో ఉదయం పూటో, సాయంత్రం సమయాన్ని కేటాయించి, ఈ శిబిరాల ద్వారా కొత్త విషయాలను నేర్చుకుంటే, నూతన విద్యా సంవత్సరంలో అవి ఉత్సాహపర్చేలా, ఉపయోగకరంగా ఉంటాయంటున్నారు. విద్యా శాఖ, ఉపాధ్యాయ సంఘాలు, కొన్ని ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. కొత్త విషయాలు, నైపుణ్యాలు నేర్చుకోవడానికి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడానికి ఇవి దోహదపడుతున్నాయి. వివిధ పోటీలతో విద్యార్థుల మేథస్సుకు పదునుపెట్టేలా పోటీతత్వం అలవడుతుంది. విజేతలకు బహుమతులు అందించడం ద్వారా వారిలో ఉత్సాహం వెల్లివిరుస్తోంది.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..

ఏటా జన విజ్ఞాన వేదిక క్రమంతప్పకుండా నగరంలో విద్యార్థులకు ఓ వేదిక ఏర్పాటు చేసి, వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. విద్యార్థులకు సైన్స్, మ్యాజిక్, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసి వారిలో ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఈ వేసవి సెలవుల్లో స్థానిక దానవాయిపేటలోని ఎస్‌కేవీటీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో గత నెల 29 నుంచి జన విజ్ఞాన వేదిక వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించింది. విద్యార్థులకు ఆనందగణితం, సైన్స్ ప్రయోగాలు చేయడం, స్పోకెన్ ఇంగ్లిష్, కథలు చెప్పడం, దేశభక్తి, జానపద గీతాలు పాడించడం, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, పర్యావరణ పరిరక్షణపై పాటలు, నృత్యాలు, చెస్, ఇతర ఆటల పోటీలు వంటి అంశాలు విద్యార్థులతో చేయిస్తున్నారు. అలాగే జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్వరలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆసక్తిగా వస్తున్నారు

వేసవి సెలవుల్లో విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలకు ఆసక్తిగా వస్తున్నారు. వారు కొత్త విషయాలు నేర్చుకునేలా ఉత్సాహాన్ని నింపుతున్నాం. పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొంటున్నారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేస్తున్నాం. జనవిజ్ఞాన వేదిక వేసవి శిక్షణ శిబిరానికి వంద మందికి పైగా విద్యార్థులు హాజరవుతున్నారు.



– ఎస్.రవిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి, జన విజ్ఞాన వేదిక

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



వేసవి శిబిరంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని యోగా టీచర్ సబ్బిశెట్టి లీలాసుందరి అన్నారు. స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో యోగా టీచర్ లీలాసుందరి విద్యార్థులకు సులభతర వ్యాయామాలు తిరగలి, నావాసన్, చక్రాసనం, సర్వాంగ ఆసనం, ఓంకార ప్రాణయామం చేయించారు. అనంతరం విద్యార్థులు డ్రాయింగ్, పుస్తక పఠనం, హ్యాండ్ క్రాఫ్ట్, లలితసంగీతం, భగవద్గీత తరగతులు నిర్వహించారు. ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.